క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్



మహబూబాబాద్: కలెక్టర్ కార్యాలయంలో శనివారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పుష్ప గుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపాడు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, నాయకులు గద్దె రవి, ఎలేందర్, అశోక్, గోగుల రాజు, బాలు, మహేష్ పాల్గొన్నారు.

అశోక్‌కు డాక్టరేట్



కేసముద్రం: మండల కేంద్రానికి చెందిన నల్లగొండ అశోక్‌కు హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో అశోక్ చేసిన పరిశోధనకు గాను జేఎన్‌టీయూ డాక్టరేట్ ప్రకటించింది.

క్రీడలతో స్నేహభావం పెంపు

మహబూబాబాద్ అర్బన్: క్రీడలతో స్నేహ భావం పెంపొందుతుందని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురం అంజయ్య అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లిలో శనివారం జమాండ్లపల్లి ప్రీమియర్ లీగ్–4 క్రికెట్ టోర్నమెంట్‌కు హాజరై క్రీడకారులను పరిచయం చేసుకున్నాడు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, కార్తిక్, నవీన్, రాజేష్, నరేష్ పాల్గొన్నారు.

10నుంచి కబడ్డీ పోటీలు

కురవి: ఈనెల 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు కురవి మండలం బలపాల గ్రామంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అరుణ్‌కుమార్, గోపి, శ్రీనివాస్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.30వేలు, ద్వితీయ బహుమతి రూ.20వేలు, తృతీయ బహుమతి రూ.15వేలు, నాల్గో బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ టీంలకు ఫీజు కట్టి నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 93467 00431, 96528 24228, 93464 02302 సంప్రదించాలని సూచించారు.

సన్మానం

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వెళ్తున్న మాజీ హెచ్‌ఎం, ఇద్దరు ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూజారి వీరయ్య, ఉపాధ్యాయ బృందం శనివారం సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూపరాణి, శ్రీనివాసులు, పీటర్, ప్రవీణ్, ఉప్పలయ్య, స్వప్న, కోటయ్య, కామేశ్వర్‌రావు, పీఈటీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కత్తిపీటతో దాడి

కురవి: ఆడబిడ్డకు గాజులు వేసేందుకు వచ్చిన మహిళపై వరుసకు అన్న అయిన వ్యక్తి కత్తిపీటతో దాడి చేయగా తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకోగా శనివారం కురవి పోలీసులకు గాయపడిన మహిళ ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. డోర్నకల్ మండలం వెన్నారం గ్రామ శివారు రాము తండా పరిధిలోని లకావత్ తండాకు చెందిన లాకావత్ సరిత, భర్త వెంకన్న శుక్రవారం సాయంత్రం కురవి మండలంలోని రాజోలు శివారు చింతల తండాలోని ఆడ బిడ్డ అయిన బానోత్ ఉషా ఇంటికి గాజులు పెట్టేందుకు వచ్చారు. ఆడబిడ్డకు గాజులు తొడిగి ఇంకో ఆడబిడ్డ అయిన బానోత్ ఆశ ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైంది. ఉషా ఇంటి ముందు లకావత్ సరిత ఆగింది. సరిత ఆడబిడ్డ ఉషకు వరుసకు మామ అయిన బానోత్ తేజా అనే వ్యక్తి మా ఇంటికి ఎందుకు వస్తున్నావు అని కత్తిపీటతో కొట్టినట్లు, కత్తిపీటతో కొడుతుండగా బానోత్ మల్లేష్ అనే వ్యక్తి అడ్డు తగలడంతో అతనిపై దాడి చేసి గాయపరిచినట్లు లకావత్ సరిత కురవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాయాలైన సరితతోపాటు మల్లేష్‌ను మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఫిర్యాదులో తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కురవి ఎస్సై గోపి కేసు బానోత్ తేజాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

తొర్రూరు రూరల్: చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని వెలికట్టలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందగా, అంత్యక్రియల అనంతరం అతడి కుటుంబానికి చెందిన బంధు మహేందర్(39) స్నానం చేసేందుకు గ్రామ శివారులోని చెరువులోకి వెళ్లాడు. స్నానం చేస్తూ నీటిలో మునిగాడు. గమనించిన బంధువులు మహేందర్‌ను బయటకు తీసేందుకు యత్నించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహేందర్ మృతితో బంధువులు, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

గ్యారంటీలతో ప్రజల జీవితాల్లో మార్పు

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య
- ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

బయ్యారం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకరానుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని కాచనపల్లిలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన సభను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందలేదని, కాంగ్రెస్ పార్టీ ప్రజాసంక్షేమం కోసం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, జిల్లా వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేకాధికారి రాజనరేందర్, తహసీల్దార్ ఇమ్మానుయల్, సర్పంచ్ వజ్జయ్య, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీ సోమేష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ పాండు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్‌లో..

మరిపెడ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ శనివారంతో ముగిసింది. చివరి రోజు మరిపెడ మండలంలోని నీలికుర్తి, బావోజీగూడెం గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు కార్యక్రమం విజయవంతంగా ముగిసినట్లు తెలిపారు. మిగిలిన వారు ఎవరైన ఉన్నప్పటికీ ఆయా గ్రామాల కార్యదర్శులను సంప్రదించి దరఖాస్తులు అందజేయవచ్చని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ పూర్ణచందర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీఎం రాములు, ఏఈ మహేష్ పాల్గొన్నారు.



బయ్యారం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య



మరిపెడ రూరల్: నీలికుర్తిలో దరఖాస్తుల స్వీకరణ

డోర్నకల్ అభివృద్ధికి చర్య తీసుకోవాలి

డోర్నకల్: డోర్నకల్ అభివృద్ధికి చర్య తీసుకోవాలని కోరుతూ ప్రజాపాలన కౌంటర్‌లో భారత యాదవ సమితి నాయకులు వినతిపత్రం అందించారు. స్థానిక పదో వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కౌంటర్‌లో శనివారం భారత యాదవ సమితి జిల్లా అధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో డోర్నకల్ పట్టణ అభివృద్ధికి చర్య తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో లింగస్వామి, ఉపేందర్, నర్సింహ పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ 24వ వార్డు పరిధిలోని ఇందిరా కాలనీలో ప్రజాపాలన అభయహస్తం గ్యారంటీల చివరి దరఖాస్తును కాంగ్రెస్ పార్టీ నాయకుడు పద్మం ప్రవీణ్‌కుమార్ అందజేశాడు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ సమ్మయ్య, మురళీ, భరత్, కుమారస్వామి, స్నేహబిందు పాల్గొన్నారు.



డోర్నకల్: దరఖాస్తు అందజేస్తున్న యాదవ సమితి నాయకులు

గార్లలో 11,376 దరఖాస్తులు

గార్ల: మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో నేటితో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ముగిసిందని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేక అధికారి బాలరాజు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న ధరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించాడు. మండల వ్యాప్తంగా ఆరు గ్యారంటీల పథకాల కోసం 11,376 మంది లబ్ధిదారులు, రేషన్ కార్డుల కోసం 2564 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వాతిబిందు, ఎంపీడీఓ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: ప్రజాపాలన గ్రామసభల్లో ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల్లోని వివరాలను పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా కంప్యూటర్లలో నిక్షిప్తం చేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న ప్రజాపాలన ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను ఎమ్మెల్యే శనివారం పరిశీలించాడు. 41 గ్రామపంచాయతీల నుంచి మండలంలో ఇప్పటి వరకు 13వేల దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపాడు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయంలో 12మంది అధికారుల పర్యవేక్షణలో ఆన్‌లైన్ చేస్తున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు.

డోర్నకల్: మండలంలో వారం రోజులపాటు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో దాఖలైన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఆర్డీఓ అలివేలు ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించాడు. మండలంలోని 26 పంచాయతీలకు సంబంధించి ఆరు గ్యారంటీలకు 10,251, జనరల్ కేటగిరిలో 3,109 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ చలపతిరావు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

అర్హులందరికీ మంజూరు చేయాలి

గార్ల: ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టిబోయిన శ్రీనివాసరావు డిమాండ్ చేశాడు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సర్వే పేరుతో ప్రభుత్వం పథకాల మంజూరులో కాలయాపన చేయవద్దన్నారు. అదేవిధంగా రైతుబంధు పథకం, యాసంగి డబ్బులు నేటికీ రైతుల ఖాతాల్లో వేయకపోవడంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నాడు. సమావేశంలో మండల కార్యదర్శి జంపాల వెంకన్న, బిక్షమయ్య, జనార్దన్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం పంచాయతీరాజ్, ఆర్టీసీ ఉద్యోగులతో ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ సమీక్ష సమావేశం నిర్వహించాడు. పంచాయతీరాజ్ శాఖ విభాగంలో ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలు తెలుసుకుని, జరగాల్సిన పనుల గురించి చర్చించారు. ఆర్టీసీ విభాగంలో ప్రస్తుతం ఏఏ మార్గాల్లో బస్సులు నడుస్తున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులు ఎక్కడైతే బస్సు రవాణా సౌకర్యం లేకుండా ఇబ్బంది పడుతున్నారో ఆయా మార్గాల్లో బస్సు రవాణా సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల అవసరాల మేరకు వారి గ్రామాల్లో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో పీఆర్ ఈఈ సురేష్, ఆర్టీసీ డీఎం శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం తప్పకుండా కృషి చేస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్లు గీత కార్మిక సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరించాడు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న, మండల కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, బొమ్మెర శ్రీకాంత్, కేసముద్రం, గూడూరు, నెల్లికుదురు మండలాల అధ్యక్షులు బబ్బూరి ఉప్పలయ్య, పానుగంటి వీరస్వామి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

బొడ్రాయికి పూజలు

మండలంలోని దామ్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్నరామోజీ తండాలో బొడ్రాయి శ్రీవేంకటేశ్వర స్వామివారి ప్రతిష్ఠ పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మురళీనాయక్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

గార్ల: తెగుళ్ల సోకి మిర్చితోటలు దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గార్లలో జరిగిన ఏఐకేఎంఎస్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, వీరభద్రం, సక్రు, మాన్యా, మంగీలాల్, మంగయ్య పాల్గొన్నారు.

25 మందిపై కేసు నమోదు

నర్సింహులపేట: మండల కేంద్రంలో ఇరు వర్గాల ఘర్షణ కేసులో 25మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపాడు. నర్సింహులపేట గ్రామానికి చెందిన వడ్డెర కులస్తులు డబ్బుల విషయంలో శనివారం అంబేడ్కర్ సెంటర్‌లో పోలీస్ స్టేషన్ ఎదుట బహిరంగంగా ఇరువర్గాలు పెద్ద ఎత్తున ఘర్షణ పడ్డారు. ఏఎస్సై కె.వెంకన్న ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన 25మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

అనాథలను అక్కున చేర్చుకోవాలి



అనాథ పిల్లలను దీవిస్తున్న సింధూర

మరిపెడ: తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను పెద్ద మనసు చేసుకొని అక్కున చేర్చుకోవాలని మరిపెడ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ గుగులోతు సింధూర అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో అనాథ బాలల పుట్టిన రోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించి, నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలవికాస ఉమెన్ కోఆర్డినేటర్ సరళ, అమూల్య, సూర్యతేజా ఏజెన్సీస్ నిర్వాహకులు, దాత ఉప్పల కృష్ణమూర్తి, మహాలక్ష్మీ దంపతులు, కోర్డినేటర్లు సుకన్య, శోభ, శ్రీదేవి, వరలక్ష్మి, ఉపేంద్ర, జొనికేన ఉనేంద్ర పాల్గొన్నారు.

దుప్పట్లు, దోమతెరల పంపిణీ

బయ్యారం: మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో తెలంగాణ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో దుప్పట్లు, దోమతెరలను శనివారం పంపిణీ చేశారు. మిర్యాలపెంట, ఇసుకమేది, నారాయణపురం, కోయగూడెం, కంబాలపల్లి, కొత్తగూడెం, అల్లిగూడెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన 40 మందికి దుప్పట్లు, 75 మందికి దోమతెరలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వరప్రసాద్, మండల ప్రత్యేకాధికారి రాజనరేందర్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మేనేజ్‌మెంట్ కమిటీ మెంబర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



దోమ తెరలు పంపిణీ చేస్తున్న సొసైటీ బాధ్యులు

పిల్లలను చదువుకు దూరం చేయొద్దు

మహబూబాబాద్: బడీడు పిల్లలను తప్పనిసరిగా బడిలోనే ఉండాలని, పనిలో పెట్టుకోవద్దని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. జిల్లా కేంద్రం శివారులోని ఆర్వోబీ కింద గుడారాలు చేసుకుని నివాసం ఉంటున్న సంచార జాతుల కుటుంబాల వద్దకు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్‌తోపాటు సభ్యులు వెళ్లారు. చైల్డ్‌లైన్ టీం ఆపరేషన్ స్మైల్ టీం ఆధ్వర్యంలో అక్కడ ఉన్న కుటుంబాలతో కౌన్సెలింగ్ చేశారు.ఈసందర్భంగా నాగవాణి మాట్లాడుతూ.. పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని చదువుకు దూరం చేయవద్దన్నారు. ఇలాంటి పిల్లలపై ఆదరణ లేకుంటే వారి జీవితాలు నాశనం అవుతాయన్నారు. అనంతరం అక్కడ ఉన్న ఆరు సంవత్సరాలపైన ఉన్న 5గురు ఆడపిల్లలను, 5గురు మగ పిల్లలను ప్రభుత్వ బాలసదానికి తరలించడం జరిగిందన్నారు. వారికి రక్షణ కల్పించి ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తామన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు డేవిడ్, అశోక్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించాలి

గూడూరు: కర్తవ్య దీక్షతో విద్యాబోధన అందిస్తూ విద్యార్థులలో నైపుణ్యం పెంపొందించాలని ప్యానెల్ టీం ప్రతినిధి డీసీఎస్ శర్మ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను శనివారం ప్యానెల్ టీం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల పరిసర ప్రాంతాలు, విద్యాబోధన, పలు అంశాలను పరిశీలించాడు. విద్యార్థులతో విద్యాబోధన పనితీరుపై అడిగి తెలుసుకున్నాడు. రానున్న పరీక్షలలో ప్రతీ ఒక్కరు పదికి పదిశాతం మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్యానెల్ టీం ప్రతనిధులు, విషయ నిపుణులు రవి, హీరాసింగ్, అనురాధ, రమణ, హరినాథం, పాపయ్య, హెచ్‌డబ్ల్యూఓ సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శర్మ

తగిన నష్టపరిహారం ఇవ్వాలి



ఆర్‌ఐకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

కేసముద్రం: తమ వ్యవసాయ భూముల నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు పోతుందని, ఇందుకు తగిన నష్టపరిహారం అందించాలంటూ ఉమ్మడి మహముద్‌పట్నం గ్రామంలోని పలుతండాలకు చెందిన పలువురు రైతులు శనివారం మండలంలోని తావ్ర్యాతండా జీపీలో ఆర్‌ఐకి వినతిపత్రాన్ని అందజేశారు. తమ భూములకు తగిన విధంగా నష్టపరిహారం చెల్లించకుండా, సంబంధిత అధికారులు తమకు హెచ్చరికలతో కూడిన వినతిపత్రాలను అందిస్తున్నారని, ఇప్పటికైనా ఇక్కడి భూములకు ఉన్న ధరలకు అనుగుణంగా పరిహారం అందించేలా ఉన్నతాధికారులు చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్, భద్రు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు నీటిసరఫరాకు అంతరాయం

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో మిషన్ భగీరథ (గ్రిడ్) మెయిన్ పైప్‌లైన్ లీకేజీ అయినందున ఈనెల 7న పలు ప్రాంతాలలో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేతనాలు విడుదల చేయాలి

కొత్తగూడ: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బంది వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడారు. ఎనిమిది నెలలుగా వేతనాలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో నరేందర్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కేసముద్రం: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన లచ్చమ్మ అనే వృద్ధురాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు శనివారం కాంగ్రెస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, క్వింటాబియ్యం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, నాయకులు సిరికొండ మల్లయ్య, యాదగిరి, లక్ష్మణ్, జల్లె యాకాంబ్రం, ప్రభాకర్, చంద్రయ్య పాల్గొన్నారు.

ఎస్సైకి శుభాకాంక్షలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డిని నడివాడ మాజీ ఎంపీటీసీ పెద్దగాని గుట్టయ్య, ఎంపీటీసీ రాయిపాటి శ్రీపాల్ రెడ్డి, నడివాడ ఉప సర్పంచ్ నల్లగుంట మధు, బీఆర్‌ఎస్ డివిజన్ యూత్ ఉపాధ్యక్షుడు మందుల రఘు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దీర్ఘకాలిక వ్యాధులు దూరం

తొర్రూరు రూరల్: ఆయుర్వేద వైద్య విధానం అనుసరణీయమని మండల ఆయుర్వేద వైద్యురాలు నిరంజనీ జకోటియా అన్నారు. శనివారం మండలంలోని కర్కాల గ్రామంలో ఆయుర్వేద వైద్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయుర్వేద వైద్యంతో అన్నివర్గాల ప్రజలకు దీర్ఘకాలిక వ్యాధులను అరికట్టేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన అన్నివర్గాల ప్రజలు ఆయుర్వేద వైద్యాన్ని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమార్, ఎంపీఓ గౌస్, సర్పంచ్ సెగ్గెం సురేఖ, ఎంపీటీసీ వల్లపు గోపమ్మ, ఫార్మాసిస్ట్ రమేష్, ప్రజలు పాల్గొన్నారు..

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



మహబూబాబాద్: సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న డిమాండ్ చేశారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మోతీలాల్, నందులాల్, రాంబాబు, సురేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కొత్తగూడ: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ నీలోఫర్ అజ్మీ శనివారం తనిఖీ చేశారు. పౌష్టికాహారం అందుతుందా లేదా తెలుసుకున్నారు. చిన్న గుడ్లు వస్తే తిరిగి పంపించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఎలాంటి తప్పులు జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆమె వెంట సూపర్‌వైజర్ రామలక్ష్మి పాల్గొన్నారు.

దంత పరిశుభ్రతతో ఆరోగ్యం

గూడూరు: దంత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ భరత్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం దంత వైద్యుడు భరత్‌రెడ్డి దంత వైద్యశిబిరం నిర్వహించాడు. విద్యార్థినులకు ఉచితంగా టూత్‌పేస్ట్, బ్రష్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

తొర్రూరు: మలమహానాడు పట్టణ, మండల అధ్యక్షలను శనివారం డివిజన్ కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌడిశాల నవీన్ అధ్యక్షతన జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేష్ ఆధ్వర్యంలో ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా అనపర్తి నాగేష్, పట్టణ అధ్యక్షుడిగా అనిల్ ఎన్నికయ్యారు.

ఆత్మహత్యాయత్నం

తొర్రూరు రూరల్: ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన మండలంలోని కంఠాయాపాలెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బోదపెల్లి శ్రీకాంత్(32) అనే వ్యక్తికి భార్య పావనితోపాటు కుమారుడు ఉన్నాడు. ఈక్రమంలో శ్రీకాంత్ తరుచూ మద్యం తాగుతుండడంతో భార్య వదిలేసి పుట్టింటికి వెళ్లింది. మద్యం మత్తులో ఒంటిపై కిరోసిన్ పోసుకోని నిప్పు పెట్టుకున్నాడు. కాగా శరీరమంతా కాలిపోవడంతో వెంటనే వరంగల్ ఎంజీఎంకి తరలించి వైద్యం అందిస్తున్నారు.

ఉచిత విద్యుత్ కొనసాగింపుపై హర్షం

కేసముద్రం: గత ప్రభుత్వం సెలూన్‌షాపులకు అందించిన 250 యూనిట్‌ల ఉచిత విద్యుత్‌ను, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించడంపై సంఘం నాయకులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జంపాల రమేష్, నాయకులు నేతాజీ, విక్రమ్, సుధాకర్, రాజు, నర్సయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తిరిగి విధుల్లో చేరిక

దంతాలపల్లి: అవినీతి ఆరోపణలపై ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను కొన్ని నెలల క్రితం విధుల్లో నుంచి తొలిగించారు. కాగా అదే విషయం కోర్టులో విచారణ నిర్వహించిన అధికారులు లక్ష్మీపురం గ్రామ కార్యదర్శి వెంకన్న, వాల్యతండా కార్యదర్శి శ్రీకాంత్‌కు మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. మరో కార్యదర్శి అక్షరను విధుల్లో నుంచి తొలగిస్తు కోర్టు తీర్పు ఇచ్చినట్లు ఎంపీడీఓ భారతి శనివారం తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత

తొర్రూరు: గురులాల్లో చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గ్రామీణ వైద్యుడు మంగళంపల్లి ప్రకాశ్ అన్నాడు. శనివారం పలువురు విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశాడు.

ఇంటింటికీ రాములోరి అక్షింతల పంపిణీ



మానుకోటలో అక్షింతల పంపిణీ..



గూడూరులో..

మహబూబాబాద్ రూరల్/గూడూరు: అయోధ్య రాముడి అక్షింతలను శనివారం శ్రీరామభక్తులు ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరామ భక్త బృందం ప్రతినిధులు పింగిళి శ్రీనివాస్, స్వరూప దంపతులు, సేవికా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివామి దగ్ధం

కురవి: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వీరబోయిన రామయ్య అనే రైతుకు చెందిన గడ్డివామి దగ్ధమైన సంఘటన సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉప్పరిగూడెం గ్రామంలో ఓ అంతిమయాత్రలో టపాసులను పేల్చగా నిప్పురవ్వలు గడ్డివామిపై పడడంతో మంటలు వ్యాపించాయి. వెంటనే సర్పంచ్ కాలం తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ తోట రమేష్ 100కు డయల్ చేశారు. దీంతో అగ్నిమాపక సిబ్బందిమంటలను ఆర్పేందుకు యత్నించారు. అయినప్పటికీ గడ్డివామి దగ్ధమైంది.

అధిక ధరలను నియంత్రించాలి

గూడూరు: కేంద్ర ప్రభుత్వ విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని, వెంటనే ధరలను నియంత్రించాలని ఎంసీపీఐ (యూ) జిల్లా ఇన్‌చార్జ్ గోనె కుమారస్వామి శనివారం డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, ఉపేందర్‌యాదవ్, నర్సింహారెడ్డి, వీరస్వామి పాల్గొన్నారు.